# మొదలు చెడ్డ బేరం

## కె.వి.వి. సత్యనారాయణ రాజు

ఆ రోజు పోస్ట్‌లో వచ్చిన ఉత్తరం చూశాక కాదు. బ్రహ్మానందం ఆనందానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుకున్నాడో అతడికే గుర్తులేదు. ఎన్నిసార్లు చదివినా తనివి తీరడంలేదు బ్రహ్మానందానికి.

కుర్చీలోంచి లేచి ఆఫీస్‌రూమ్‌లో మూలగా ఉన్న వాటర్ ఫిల్టర్‌లోనుంచి నీళ్ళు తీసుకొని తాగి హుషారుగా సిగరెట్ ముట్టించి, తను భద్రంగా దాచిన ఆ ఉత్తరాన్ని డెస్క్‌లోనుంచి బయటకు లాగి, జాగ్రత్తగా మడతలు విప్పి, కాళ్ళు టేబిల్‌కు తన్నిపెట్టి మళ్ళీ చదవడం ప్రారంభించాడు.

శ్రీ బ్రహ్మానందంగారికి,

మీ కథ, 'ఆదర్శ రచయిత'ను ప్రచురణకు స్వీకరించాము. ఆ కథను ఏప్రిల్ సంచికలో ప్రచురింపబోతున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం. రచన పంపినందుకు ధన్యవాదాలు.

ఎడిటర్

వెండిగిన్నె మాసపత్రిక

బ్రహ్మానందం గత ఆరేళ్ళుగా రచనలు చేస్తున్నాడు. అతని కథలు తిప్పి పంపని పత్రికలేదు. కానీ విసుగు చెందకుండా పంపించిన పత్రికలకే మళ్ళీ పంపిస్తూ ప్రతినెలా జీతంలో కొంతశాతం స్టాంపులకు కేటాయించి పోస్టల్ డిపార్ట్‌మెంట్ అభ్యున్నతికి యథాశక్తి తోడ్పడుతూనే ఉన్నాడు. అతడు రచనలు ప్రారంభించిన ఇన్నేళ్ళకి ఓ పత్రిక అతనికథ ప్రచురింపబోతున్నామని తెలియజేయడంతో ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు బ్రహ్మానందం.

ఆ తరువాత తీవ్రంగా ఆలోచించాడు. ఈ ప్రపంచంలో దేనికైనా పబ్లిసిటీ ముఖ్యం. పబ్లిసిటీ లేకుండా నిజంగా ఎంత గొప్ప సినిమా అయినా విజయవంతం

అలాగే పబ్లిసిటీ లేకుండా గుండుసూది మొదలు గునపం వరకూ ఏదీ అమ్ముడవదు. సో... తను రచయితగా నిలబడాలంటే, ఆంధ్రదేశం మొత్తం హర్షించే, జేజేలు పలికే వ్యక్తిగా గుర్తింపు పొందాలంటే తనకూ పబ్లిసిటీ కావాలి.

కానీ తనలాంటి కొత్త రచయితకు పబ్లిసిటీ ఎలా వస్తుందనేదే అసలైన చిక్కు ప్రశ్న. డబ్బులు ఖర్చుపెట్టి ఫలానా ప్రఖ్యాత రచయిత కథ ఫలానా పత్రికలో, ఫలానా సంచికలో రాబోతోందని వివిధ దిన, వార పత్రికల్లో ప్రకటనలు ఇస్తే...?

ఛ... ఛ... చాలా అసహ్యంగా ఉంటుంది. ఫలానా రచయిత రచన ప్రచురిస్తున్నాం! అని గర్వంగా ఆ పత్రిక ప్రచురిస్తే అందంగానీ, ఊరూ పేరూ లేకుండా తనంతట తానే ప్రకటన ఇస్తే బాగోదు. కానీ తనకు పబ్లిసిటీ కావాలి! తను పాపులర్ కావడం ఎలా?

** ** **

తనకు వచ్చిన కాంప్లిమెంటరీ చూసుకొని మురిసిపోయాడు బ్రహ్మానందం. పోస్ట్‌లో వచ్చిన ఆ పుస్తకంపైన ఉన్న రేపర్‌ను దానిమీద ఉన్న ఎడ్రస్‌ను ఆప్యాయంగా తడిమాడు. ఆ రేపర్ చింపి పుస్తకం బయటకు తీయడానికి అరగంట పైనే పట్టింది బ్రహ్మానందానికి.

చివరికెలాగైతేనేం రేపర్ చింపి ముడతలు పడి ఉన్న పుస్తకాన్ని సాపు చేశాడు. కానీ ఆ ముడతలు అలాగే ఉండడంతో ఆ పుస్తకాన్ని వరుసగా పేర్చి ఉన్న తన ఆఫీస్ రిజిష్టర్స్‌ను పైకెత్తి వాటి క్రింద ఉంచాడు.

సరిగ్గా అరగంట తర్వాత ఆ పుస్తకాన్ని రిజిష్టర్ల క్రిందనుంచి తీసి దానిమీద ఉన్న ముఖ చిత్రాన్ని చూశాడు. ఏదో సినిమాలో డ్యూయెట్ సన్నివేశం అది. మొదటి పేజీ తిప్పాడు జాగ్రత్తగా.

ఏదో సబ్బు తాలూకూ అడ్వర్‌టయిజ్‌మెంట్ పేజీ నిండుగా కనిపించింది. అదే ప్రకటన అప్పటికి ఎన్నిసార్లో వివిధ పత్రికల్లో చూసి ఉన్నా ఆ క్షణంలో బ్రహ్మానందం కళ్ళకు ఎంతో సుందరంగా కనిపించిందది.

పెళ్ళిచేసుకొంటే ఇటువంటి అమ్మాయినే చేసుకోవాలని అప్పటికప్పుడేతీర్మానించుకొన్నాడు. ఆనంద పారవశ్యంతో ఫలానా సబ్బునే వాడండి! అని షోగ్గా దాదాపు వంటిమీద బట్టల్లేకుండా నిలబడిన ఆ అమ్మాయిని తనకు నచ్చిన చోట ముద్దుపెట్టుకొని వణికే చేతులతో ఆ పేజీ తిప్పాడు.

పక్క పేజీలో ఎడమవైపు 'విషయ సూచిక' అనే అక్షరాలు కనబడగానే ఆనందంతో కళ్ళు మూసుకున్నాడు బ్రహ్మానందం. ఇంకా కొద్ది సెకన్లలో తన పేరు మొదటిసారిగా అచ్చులో చూసుకోబోతున్నాడు. ఉద్వేగాన్ని అదుపులో పెట్టుకొని దృష్టిని పుస్తకంమీదకు సారించాడు.

మొదటికథా, దాని రచయితపేరూ చదివాడు. తరువాత రెండు, మూడు, నాలుగు... అలా విషయ సూచిక క్రిందవరకూ చదివాడు. అతడి కథ కనబడలేదు. ఒకవేళ కథకు తనుపెట్టినపేరు బాగోపోతే పేరు మార్చేరేమో అనుకుని రచయితలపేర్లు చూశాడు పైనుంచి క్రిందికి. అతడిపేరులేదు.

పైనుంచి క్రిందికి, క్రిందినించి పైకి ఓ పదిసార్లు చూశాడు. ప్రయోజనం శూన్యం! తరువాత ఒకో పేజీ తిప్పాడు. ఒకవేళ విషయసూచికలో పొరపాటున ప్రింట్ కాలేదేమోనని. అలా ఒకోపేజీ తిప్పేకొలదీ బ్రహ్మానందం బ్లడ్‌ప్రెషర్ రైజ్ అయి ఆఖరుపేజీ తిప్పేసరికి ఓ టూత్‌పేస్ట్ ప్రకటన కనిపించింది.

కొద్ది క్షణాల క్రితం అతడు చూసిన సబ్బు తాలూకు ప్రకటనలోని అమ్మాయే టూత్ బ్రష్ నోట్లో పెట్టుకొని చిరునవ్వులు చిందిస్తోంది. ఉక్రోషంతో పుస్తకాన్ని నేలకేసి కొట్టాడు బ్రహ్మానందం.

అంతలోనే ఓ ఆలోచన ఫ్లాష్‌లా వచ్చిందతడికి. మరుక్షణంలోనే అది పెద్దదై అతడి మెదడంతా ఆక్రమించింది. తన కథ ఆ సంచికలో పడనందుకు బాధపడ్డా అతని మనసు ఆ విషయం మరచిపోయి మరో విషయం గురించి తీవ్రంగా ఆలోచించింది.

అలా ఆలోచిస్తూనే తనను తాను తిట్టుకున్నాడు తన తొందరపాటుచర్యకు. పదినిమిషాల్లో అతని అవతారం పూర్తిగా మారిపోయింది. జుట్టుపీక్కుని, పిడికిళ్ళు బిగించి టేబుల్‌మీద గుద్దుతూ 'డామిట్! ఇపుడెలా?' అనుకున్నాడు తనలోతానె.

** ** **

పోస్ట్‌మేన్ అందించిన కవరు తీసుకొని ఫ్రమ్ ఎడ్రస్ చూశాడు. పత్రికా కార్యాలయంనుంచి వచ్చిందది బ్రహ్మానందం నీరసపడిపోయాడు. అందులో ఏముంటుందో అతడికి తెలుసు. తీవ్రంగా బాధపడుతూ కవరు చించాడు. వణికే చేతుల్తో అందులోని కాగితం తీసి చదువుకున్నాడు.

ఇదంతా గమనించాక మాకు సంతోషించాలో బాధపడాలో అర్థం కాలేదు. మీ కథ ఫలానా సంచికలో ప్రచురింపబడుతోందని మీకూ మాకు తప్ప పాఠకులెవరికీ తెలిసే అవకాశం లేదు....

శ్రీ బ్రహ్మానందంగారికి,

కారణాంతరాలవల్ల మేము మీకు తెలియజేసినట్లుగా మీ కథ ఫలానా సంచికలో ప్రచురింపబడలేదు. కానీ మాకు ఆశ్చర్యం కలిగించే విధంగా మీరు వ్రాసిన కథ 'ఆదర్శ రచయిత' చాలా బాగుందంటూ దాదాపు వంద ఉత్తరాలు వచ్చాయి. మా పత్రిక ప్రారంభించిననాటినుంచీ ఇంతవరకూ మేము ప్రచురించిన ఏ కథకూ ఇన్ని అభినందన లేఖలు రాలేదు.


మీ కథ కంపోజ్ చేసి ప్రచురించే సమయంలో కొన్ని అనివార్య కారణాలవలన ప్రచురించలేకపోయాం. కాంప్లిమెంటరీ కాపీలు పంపవలసిన లిస్ట్ మేము అప్పటికే ఫైనలైజ్ చేసి డిస్పాచ్ వింగ్‌కు అందజేయడంవలన మావాళ్ళు రొటీన్‌గా పంపించిన కాంప్లిమెంటరీ మీకు అంది ఉంటుంది.

మీ కథ ఆ సంచికలో ప్రచురించబడకపోయినా ఈ కథ ప్రచురించి మీ పత్రిక ప్రతిష్ఠ తారాపథంలో నిలబడేలా చేశారని, ముమ్ముందు ఈ రచయిత కథలు తప్పనిసరిగా ప్రతి సంచికలోనూ ప్రచురించమని మా పత్రిక శ్రేయోభిలాషులు చాలామంది మాకు తెలియజేశారు.

ఇదంతా గమనించాక మాకు సంతోషించాలో బాధపడాలో అర్థంకాలేదు. మీ కథ ఫలానాసంచికలో ప్రచురింపబడబోతుందని మీకూ మాకూ తప్ప పాఠకులెవరికీ తెలిసే అవకాశంలేదు.

కానీ ఆ కథ ప్రచురింపబడినట్లు, అది చదివి ఆనందం పొందినట్లు ఇన్ని ఉత్తరాలు రావడం ఎలా సాధ్యమో బహుశ మీకు తెలిసే ఉంటుంది. మేమూ ఊహించగలంకూడా.

నిజానికి చెప్పాలంటే మీ కథలో పసలేదు. కానీ రచనలో వైవిధ్యం ఉన్న దృష్ట్యా ఎంకరేజ్ చేస్తే ఓ కొత్త రచయితకు అవకాశమిచ్చినట్టు ఉంటుందనే ఉద్దేశ్యంతో మీ కథ ప్రచురించాలని నిశ్చయించాం.



కానీ అది ప్రచురితం కాలేదు. ఇది మంచికే జరిగిందని మేము భావిస్తున్నాము. పత్రికలు సాధారణంగా రచయితల వ్యక్తిగత జీవితం గురించి, వారి ఊహల గురించి పట్టించుకోవు.

కానీ మీలాంటి రచయితలు (?) ఇంకా ఎకౌంట్ ఓపెన్ చేయకుండానే ఇటువంటి చీప్ ట్రిక్స్ ఉపయోగించి పాపులర్ అవాలనుకొంటే మాత్రం మేము సహించం.

మీ కథ గురించి మీరే రకరకాల పేర్లతో వివిధ ప్రదేశాల నుంచి ఉత్తరాలు వ్రాసారనేది నగ్నసత్యం. మీ ప్రవర్తన మేము పైన ఉదహరించిన కారణాల దృష్ట్యా మీ కథ మీకే తిప్పి పంపిస్తున్నాం. అంతేగాకుండా మీ రచనలు ఇంకెప్పుడూ మా పత్రికకు పంపించవద్దని సవినయంగా మనవిచేసుకొంటూ మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం.

ఎడిటర్

వెండిగిన్నె మాసపత్రిక

చదవడం పూర్తయ్యేసరికి బ్రహ్మానందం మొహం పాలిపోయింది తెల్లగా. పబ్లిసిటీ కోసం ఉత్తరాలు వ్రాయడానికి తను ఖర్చుపెట్టిన డబ్బులు, వాటన్నిటికంటే ఎక్కువగా తన ప్రయత్నం బెడిసికొట్టడం తలచుకొంటే ఏడుపొచ్చింది బ్రహ్మానందానికి.

*